క్లుప్తంగా

రేపటి నుంచి కల్యాణ మహోత్సవాలు

ముమ్మిడివరం: మండలంలో కొత్తలంక అనంతలక్ష్మీ, సత్యవతి సమేత వివేక సత్యనారాయణస్వామి వారి కల్యాణ మహోత్సవాలు ఈ నెల 19 నుంచి నిర్వహిస్తున్నట్టు ఆలయ కమిటీ సభ్యులు తెలిపారు. ఈ నెల 19న స్వామివారికి ప్రత్యేక వస్త్రాలు, స్వామి వారి కల్యాణ మహోత్సవాలు జరుగుతాయి. 20న మూల మూర్తులకు విశేష అభిషేకాలు, 21న స్వామి పూజ కార్యక్రమాలు, 22న వామంకిత స్థిత జానకీ వల్లభునికి విశేష పూజలు, 23న స్వామి వారికి చక్రస్నానం ఉంటుంది.

అకాల వర్షాలపై అప్రమత్తంగా ఉండాలి


సమావేశంలో మాట్లాడుతున్న ఎంపీడీఓ

అల్లవరం: భారీ వర్షాలకు గ్రామాల్లో ప్రజలు ఇబ్బంది పడకుండా తగు చర్యలు తీసుకోవాలని ఎంపీడీఓ కృష్ణ మోహన్ కార్యదర్శులను ఆదేశించారు. అల్లవరం మండల పరిషత్ కార్యాలయంలో కార్యదర్శులు, సచివాలయ సిబ్బందితో శుక్రవారం సమీక్ష నిర్వహించారు. ఎన్నికల కోడ్ నేపథ్యంలో గ్రామాల్లో తాగునీరు, ఉపాధి, ఆరోగ్య సేవల్లో ఎలాంటి ఇబ్బందులు తలెత్తరాదన్నారు. పారిశుధ్య నిర్వహణ, శుద్ధమైన తాగునీటి పంపిణీకి ప్రత్యేక చర్యలు చేపట్టాలన్నారు. ఈ కార్యక్రమంలో కార్యదర్శులు రాజమోహన్, ఎస్‌వీవీ సత్యనారాయణ, పి.శ్రీనివాస్, దుర్గా శ్రీనివాస్, కేవీవీ సత్యనారాయణ, చిక్కం శ్రీను, శ్రీరామచంద్రమూర్తి, మృదుల, కనకమ్మ, రవిరాజు తదితరులు పాల్గొన్నారు.

నేత్రదానం


వుంగరాల సుబ్బలక్ష్మి(ఫైల్)

తాళ్లరేవు: పి.మల్లవరం గ్రామానికి చెందిన వుంగరాల సుబ్బలక్ష్మి(55) శుక్రవారం ఉదయం మరణించారు. ఆమె నేత్రాలను కుటుంబ సభ్యులు రాజా, రాజేశ్వరి అంగీకారంతో కాకినాడ బాదం బాలకృష్ణ ఐ–బ్యాంక్‌కు అందజేశారు. సామాజిక కార్యకర్త ధూళిపూడి వెంకటరమణ నేతృత్వంలో ఆమె కార్నియాలను ఐ–బ్యాంక్ టెక్నీషియన్ రవి సేకరించారు.

ఎస్పీకి విదసం ఐక్య వేదిక వినతిపత్రం

అమలాపురం రూరల్: విశాఖ దళిత సంఘాల(విదసం) ఐక్యవేదిక శుక్రవారం డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ కోనసీమ జిల్లా ఎస్పీకి వినతిపత్రం సమర్పించింది. ఎన్నికల సందర్భంగా ఎమ్మెల్సీ తోట త్రిమూర్తులు నిబంధనలు ఉల్లంఘించారని, ఆయన బెయిల్‌ను రద్దు చేయాలని పేర్కొంది. ఈ మేరకు ఎన్నికల కమిషన్‌కు, జాతీయ ఎస్సీ కమిషన్‌కు ఈ కాపీలు పంపుతున్నట్టు ఐక్య వేదిక రాష్ట్ర కన్వీనర్ జూసి వెంకటరావు తెలిపారు.

19 నుంచి కురంగేశ్వరుని కల్యాణోత్సవాలు

తాళ్లరేవు: కోరంగి పంచాయతీ పాతకోరంగి గ్రామంలో ఉన్న బాలాత్రిపుర సుందరీ సమేత కురంగేశ్వరస్వామివారి కల్యాణోత్సవాలు ఈ నెల 19 నుంచి 24వ తేదీ వరకు నిర్వహించనున్నట్టు ఆలయ ఈఓ కేవీ వేణుగోపాల్ శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఆలయ అర్చకులు కేఆర్‌కే సాయిప్రసాద్ నేతృత్వంలో స్వామి వారికి ఆదివారం రాత్రి 7 గంటలకు దివ్య కల్యాణం, అదే రోజు రాత్రి 8 గంటల నుంచి మహా అన్నదానం జరుగుతుందన్నారు. అలాగే 21న రాత్రి 7 గంటలకు సదస్య మహోత్సవం, 23న ఉదయం 6.30కు త్రిశూల స్నానం, అదే రోజు రాత్రి 7 గంటలకు స్వామివారి తెప్పోత్సవం, 24న రాత్రి 7 గంటల నుంచి పుష్పయాగోత్సవం తదితర కార్యక్రమాలు నిర్వహించనున్నట్టు వివరించారు.

ఒత్తిడికి దూరంగా ఉండాలి

కపిలేశ్వరపురం: ఆధునిక కాలంలో మానసిక ఒత్తిడికి దూరంగా ఉండాలని అంగర పీహెచ్‌సీ ఎంపీహెచ్‌ఈఓ జిత్తుక మల్లికార్జునుడు అన్నారు. శుక్రవారం వరల్డ్ హైపర్ టెన్షన్ డే సందర్భంగా మండలంలోని అంగర పీహెచ్‌సీ పరిధిలోని అంగర, పడమర ఖండ్రిక, కపిలేశ్వరపురం, తాతపూడి గ్రామాల్లో అవగాహన సమావేశాలు నిర్వహించారు. మల్లికార్జునుడు, హెల్త్ ఎడ్యుకేటర్ బి.రామారావు, హెచ్‌వీ తాతపూడి మేరీమణి మాట్లాడుతూ బీపీని ఎప్పటికపుడు పరీక్షించుకుంటూ జాగ్రత్త పాటించాలన్నారు. వైద్య, ఆరోగ్య సిబ్బంది, ఆశా కార్యకర్తలు పాల్గొన్నారు.

ఈత సరదాలపై అప్రమత్తంగా ఉండాలి

కె.గంగవరం: వేసవి కాలం కావడం వల్ల గ్రామీణ ప్రాంతాల్లోని యువత ఉల్లాసం కోసం పంట కాలువలు, చెరువులు, గోదావరిలో ఈతకు దిగడం ప్రమాదకరమని రామచంద్రపురం సీఐ పి.దొరరాజు హెచ్చరించారు. మండల కేంద్రమైన కె.గంగవరం పోలీస్‌స్టేషన్‌లో శుక్రవారం ఆయన విలేకరులతో మాట్లాడారు. వేసవి సెలవుల కారణంగా పట్టణాల్లో ఉండే యువత సొంత ఊర్లకు రావడం లేదా, బంధువుల ఇంటికి వెళ్లడం సర్వసాధారణమన్నారు. ఇలా పల్లెలకు వచ్చిన యువత సరదా కోసం తెలియని చోట పంట కాలువలు, చెరువులు, గోదావరిలో ఈతకు దిగుతున్నారన్నారు. ఇటీవల కపిలేశ్వరపురం, ఆలమూరు మండలాల్లో సరదా కోసం ఈతకు దిగి ఇద్దరు యువకులు మృతి చెందారన్నారు.

అన్నదాతకు శాపం

- నిర్లక్ష్యంగా పంట కాలువలకు రిటైనింగ్ వాల్ నిర్మాణం
- పంట భూములకు సాగు నీరందని దుస్థితి
- నిరుపయోగంగా మారిన కాంక్రీట్ కట్టడం
- పూర్తిగా తొలగించి, పునర్నిర్మించాలని రైతుల డిమాండ్


సాగు నీరు సక్రమంగా అందని శివారు భూములు

తాళ్లరేవు: ముందుచూపు లేని ప్రణాళిక, అధికారుల నిర్లక్ష్యం వెరసి రైతుల పాలిట శాపంగా మారింది. చొల్లంగి వ్యవసాయ భూములకు నిరంతరం సాగు నీరందించే పంట కాలువను గత టీడీపీ పాలకుల అనాలోచిత నిర్ణయాల కారణంగా రైతాంగానికి తీవ్ర ఇబ్బందులు తెచ్చిపెట్టింది. నిక్షేపంలా ఉన్న పంట కాలువను పూడ్చివేసి, సుమారు ఏడేళ్ల క్రితం కాంక్రీటు నిర్మాణం చేపట్టి రైతులను అష్టకష్టాల పాలు చేశారు. ఏటా సీజన్‌లో ఆయకట్టులోని శివారు భూములకు సాగు నీరందక రైతులు ఇబ్బందులు పడుతున్నారు.

కాజులూరు మండల పరిధిలోని గొర్రిపూడి చానల్ నుంచి తాళ్లరేవు మండలం చొల్లంగి ప్రాంతంలోని సుమారు 250 ఎకరాల ఆయకట్టు భూములకు సాగునీరు అందేది. పంట కాలువల అభివృద్ధి పేరుతో గత టీడీపీ ప్రభుత్వంలో సొమ్ముల కోసం కక్కుర్తిపడి, ఆదరాబాదరా కాలువకు ఇరువైపులా కాంక్రీటు నిర్మాణం చేశారు. సుమారు 9 అడుగుల మేర ఉన్న కాలువను నాలుగు అడుగులకు కుదించి, కాంక్రీటు నిర్మాణాలు చేసేశారు. దీనివల్ల సాగునీరు పూర్తి స్థాయిలో సరఫరా కాకపోవడంతో వరిచేలు ఎండిపోతున్నాయని రైతులు తీవ్ర ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

సాగునీరు అందక కొంతమంది రైతులు వ్యవసాయానికి దూరమై కూలీ పనులకు వెళ్లాల్సిన పరిస్థితి నెలకొంది. చొల్లంగి ఎత్తిపోతల పథకం ద్వారా సుమారు 450 ఎకరాలకు సాగునీరు అందేదని, రిటైనింగ్ వాల్స్ నిర్మించడం ద్వారా శివారు భూములకు నీరు రాకపోవడంతో వరిచేలు బీడు వారుతున్నాయని పలువురు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఎన్నిసార్లు అధికారుల దృష్టికి తీసుకువెళ్లినా ఫలితం లేదంటున్నారు. తక్షణమే అధికారులు స్పందించి కాంక్రీట్ నిర్మాణాలను తొలగించి, పాత కాలువను పునరుద్ధరించాలని కోరుతున్నారు. పంట కాలువను వెడల్పు చేసి, కాంక్రీటు నిర్మాణాలను చేపట్టి తమ కష్టాలను తొలగించాలని ఆ ప్రాంత రైతులు కోరుతున్నారు.


కుదించి కాంక్రీటుతో నిర్మించిన పంట కాలువ

నీరు లేకుండా చేశారు



నిక్షేపంలా ఉన్న పంట కాలువను పూడ్చివేసి కాంక్రీటు నిర్మాణంతో సాగునీటి కష్టాలను తెచ్చిపెట్టారు. గతంలో సాగునీరు పూర్తిస్థాయిలో అందడంతో పంటలు బాగా పండేవి. కాలువ కాంక్రీటు నిర్మాణం జరిగిన తరువాత సాగునీరు అందక, పంటలు పండక తీవ్ర నష్టాలు చవిచూడాల్సి వస్తోంది. శివారు భూముల రైతులైతే పంటను పండించలేక బీడుగా వదిలివేశారు.

– కట్టిమేను నూకరాజు, రైతు, చొల్లంగి

పంట కాలువను పునర్నిర్మించాలి



గత టీడీపీ ప్రభుత్వంలో నిర్మించిన పంట కాలువ కారణంగా రైతులు వ్యవసాయానికి దూరం అవుతున్నారు. విశాలంగా ఉన్న పంట కాలువను కుదించి నిర్మించడంతో, సాగునీరు శివారు ప్రాంతాలకు అందడం లేదు. దీంతో వ్యవసాయం చేయలేక రైతులు కూలీ పనులకు వెళ్లాల్సిన దుస్థితి. ఇకనైనా ప్రజాప్రతినిధులు, అధికారులు దృష్టి సారించి పంట కాలువను గతంలో మాదిరిగా పునర్నిర్మించాలి.

– నిమ్మగడ్డ శ్రీను, రైతు, చొల్లంగి

ఎల్ఐసీ బీఎం శ్రీధర్‌కు ఘన సన్మానం


బీఎం శ్రీధర్‌ను సన్మానిస్తున్న అధికారులు, ప్రతినిధులు

అమలాపురం టౌన్: అమలాపురంలోని ఎల్ఐసీ బ్రాంచి మేనేజర్‌గా పనిచేస్తూ పదోన్నతిపై సీనియర్ బ్రాంచి మేనేజర్‌గా తాడేపల్లిగూడెం బ్రాంచికి వెళ్తున్న శ్రీధర్‌కు ఇక్కడి ఉద్యోగులు, ఏజెంట్లు గురువారం రాత్రి ఘనంగా వీడ్కోలు పలికారు. ఎల్ఐసీ ఉద్యోగులు, డీఓలు, ఏజెంట్ల ఆధ్వర్యంలో బ్రాంచి కార్యాలయంలో గురువారం రాత్రి బీఎం శ్రీధర్‌ను సత్కరించారు. ఈ సందర్భంగా వారు శాలువాలు, పూలమాలలు, షీల్డ్‌లతో ఘనంగా సన్మానించారు. పలువురు వక్తలు మాట్లాడుతూ రాజమహేంద్రవరం డివిజన్ పరిధిలో అమలాపురం బ్రాంచి కార్యాలయాన్ని మొదటి స్థానంలో ఉంచడంలో శ్రీధర్ కృషి చేశారని, కోవిడ్ సమయంలో పాలసీదారులకు విశేష సేవలందించారని కొనియాడారు. ఈ కార్యక్రమంలో అంబాజీపేట ఎస్ఓ బీఎం లలిత కుమార్, ఏబీఎం వి.ప్రసన్నకుమార్, డీఓలు రామారావు, దుర్గాప్రసాద్, సుబ్రహ్మణ్యం, మనోజ్, నాయక్, అప్పారావు, వీరేంద్ర, ఏఓలు చక్రవర్తి, కొండలరావు, కామేశ్వరరావు, ఏజెంట్ అసోసియేషన్ ప్రతినిధులు సుందరనీడి శ్రీనివాసరావు, శ్యామ్ బాబు, పరమేష్ తదితరులు పాల్గొన్నారు.

బౌద్ధ ఉత్సవాల పోస్టర్ ఆవిష్కరణ


ఉత్సవాల పోస్టర్‌ను ఆవిష్కరిస్తున్న సంఘ ప్రతినిధులు

యానాం: బుద్ధ జయంత్యుత్సవాలను పురస్కరించుకుని నిర్వహిస్తున్న ప్రాచీన భారతీయ వారసత్వ బౌద్ధ సాంస్కృతిక ఉత్సవాల పోస్టర్‌ను శుక్రవారం స్థానిక మెట్టకూరు రమాబాయినగర్ అంబేడ్కర్ విగ్రహం వద్ద బౌద్ధ సంఘం ప్రతినిధులు ఆవిష్కరించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ఈ నెల 26న ఆదుర్రు దివ్య బౌద్ధ మహాస్తూప ప్రాంగణంలో ఉదయం 9 గంటల నుంచి ఈ ఉత్సవాలను నిర్వహిస్తున్నారన్నారు. ప్రపంచ శాంతిని కాంక్షించిన మహోన్నతుడు భగవాన్ బుద్ధుడు బోధించిన మార్గాలను, బోధిసత్వ అంబేడ్కర్ దేశ అభ్యున్నతికి బౌద్ధాన్ని పునరుద్ధరించారన్నారు. ఈ కార్యక్రమానికి మీరట్ నుంచి పూజ్య భిక్షు డాక్టర్ నాగభూషణ కొండయ్య, పూజ్యబంతేజీ తదితరులు హాజరవుతున్నారని చెప్పారు. ఈ కార్యక్రమంలో బీఎస్ఐ జిల్లా కార్యదర్శి కాశి వెంకటరమణ, కొమ్మాబత్తుల రఘు, మట్టా శ్రీను, మతా మహాలక్ష్మి, తాటిపాక దుర్గబాబు, ఇసుకపట్ల విశ్వనాథం, ఎలిపే రాజ్‌కుమార్ పాల్గొన్నారు.

మొలకెత్తుతున్న ధాన్యం రాశులు


రెల్లుగడ్డలో భారీ వర్షాలకు మొలకెత్తిన బస్తాల్లోని ధాన్యం

అల్లవరం: మండలం వ్యాప్తంగా బుధవారం రాత్రి కురిసిన అకాల వర్షం రైతుల పాలిట శాపంగా మారింది. కళ్లాల్లోని ధాన్యం రాశులు, ధాన్యం బస్తాల లాటుల్లోకి వర్షం నీరు చేరడంతో మొలకెత్తుతున్నాయి. రైతుల నుంచి కొనుగోలు చేసిన ధాన్యాన్ని కళ్లాల్లోనే ఉంచేయడంతో భారీ వర్షానికి తడిసి ముద్దయ్యాయి. తడిసిన ధాన్యాన్ని రైతులు ఆరబెట్టే ప్రయత్నం చేసినా, వాతావరణం కుదుటపడక, తడిసిన ధాన్యం బస్తాల్లోనే మగ్గి మొలకెత్తుతోంది. దీంతో రైతులకు ఏమి చేయాలో పాలుపోక సతమతమవుతున్నారు. తడిసిన ధాన్యం ఆరబెట్టలేక, దళారులు ధాన్యం బస్తాలను తీసుకెళ్లక దిక్కుతోచని స్థితిలో రైతులు ఉన్నారు. దేవగుప్తం, డి.రావులపాలెం, ఎంట్రుకోన, రెల్లుగడ్డ తదితర గ్రామాల్లో ధాన్యం బస్తాలను ఒబ్బిడి చేసే ప్రయత్నం చేశారు. రెల్లుగడ్డలోని వ్యవసాయ క్షేత్రాల్లోకి వర్షం నీరు భారీగా చేరడంతో, వరి కోతలు నిలిచిపోయాయి. వర్షం నీరు డ్రైన్‌లోకి దిగే వరకూ రైతులు వేచి చూడాల్సిన పరిస్థితి నెలకొంది. వర్షం కురిసే అవకాశం ఉందని రైతులకు ముందస్తు సూచనలు చేయడంలో వ్యవసాయ, రెవెన్యూ శాఖల అధికారులు విఫలమయ్యారు. అధికారులు సార్వత్రిక ఎన్నికల్లో పడి రైతాంగాన్ని పట్టించుకోలేదని రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.


దేవగుప్తంలో తడిసిన ధాన్యం బస్తాల లాటు

మంచి అలవాట్లతో రక్తపోటు నియంత్రణ


కేశనకుర్రు పీహెచ్‌సీలో ప్రతిజ్ఞ చేస్తున్న వైద్య, ఆరోగ్య సిబ్బంది

ఐ పోలవరం: మూడు పదుల వయస్సు దాటిన ప్రతిఒక్కరూ బీపీ పరీక్ష చేయించుకోవాలని కేశనకుర్రు ప్రాథమిక ఆరోగ్య కేంద్రం వైద్యాధికారి డాక్టర్ శివగాయత్రి అన్నారు. బీపీ ఉంటే క్రమం తప్పకుండా వైద్యులు సూచించిన మేరకు మందులు వాడాలన్నారు. శుక్రవారం ప్రపంచ హైపర్ టెన్షన్ డేను పురస్కరించుకుని పీహెచ్‌సీ, సచివాలయాల పరిధిల్లో రక్తపోటుపై క్షేత్ర స్థాయి అవగాహన కార్యక్రమాలను, ర్యాలీని నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ జీవన శైలిలో మార్పులు చేసుకుంటూ, ఆరోగ్యకర ఆహారపు అలవాట్లను అలవర్చుకోవాలన్నారు. శారీరక వ్యాయామం చేయడం ద్వారా బీపీని నియంత్రించవచ్చని ఆమె సూచించారు. రక్తపోటును నియంత్రణలో తేవడం ద్వారా గుండె, మెదడు సంబంధిత వ్యాధులు నివారించవచ్చని తెలిపారు. ఈ కార్యక్రమంలో డాక్టర్ ఎం రాజేష్‌బాబు, ఎంవీ వెంకటేష్, ఏఎన్ఎంలు, ఆశా వర్కర్లు పాల్గొన్నారు.

విద్యుత్ స్తంభాలపై తీగల తొలగింపు


గొల్లవిల్లిలో విద్యుత్ స్తంభానికి ఉన్న పాదు తీగలను తొలగించిన దృశ్యం


భీమనపల్లిలో..

ఉప్పలగుప్తం: మండలంలోని పలు గ్రామాల్లో విద్యుత్ స్తంభాలకు అల్లుకున్న పాదు జాతి తీగలను శుక్రవారం ఏపీఈపీడీసీఎల్ సిబ్బంది తొలగించారు. గొల్లవిల్లి, భీమనపల్లి గ్రామాల్లో ప్రధాన రహదారి వెంబడి ఉన్న విద్యుత్ స్తంభాలకు పాదుజాతి తీగలు అలమటంతో 'అల్లుకున్న నిర్లక్ష్యం' శీర్షికతో గురువారం 'సాక్షి'లో వార్త ప్రచురితమైన కథనానికి అధికారులు స్పందించారు. స్తంభాలపై తీగలను తొలగించడంతో సమస్యకు పరిష్కారం లభించింది.

19న ఉన్నత విద్యా శాఖ వెబినార్

యానాం: ఉన్నత చదువుల ఎంపికను సులభతరం చేయడానికి వీలుగా కళాశాలలు, కోర్సుల ప్రొఫైల్‌పై విద్యార్థులు, తల్లిదండ్రులకు సమాచారాన్ని వ్యాప్తి చేయడానికి వీలుగా.. కాలేజీని తెలుసుకోండి–మీ కోర్సును ఎంచుకోండి అనే వెబినార్ ప్రత్యక్ష ఇంటరాక్టివ్ కార్యక్రమాన్ని ఈ నెల 19న నిర్వహిస్తున్నారు. ఈ మేరకు పుదుచ్చేరి ఉన్నత విద్య, సాంకేతిక విద్యా శాఖ డైరెక్టర్ అమన్‌శర్మ శుక్రవారం ఓ ప్రకటనలో తెలిపారు. ఆయా కళాశాలలు అందించే కోర్సులు, కళాశాలల్లో మౌలిక సదుపాయాలు, ఇతర సంస్థలతో భాగస్వామ్యం, కెరీర్ ఎంపికలో విజయాలు, ప్లేస్‌మెంట్ అవకాశాలు తదితర వాటిని అన్ని ప్రభుత్వ కళాశాలల వివరాలు ప్రదర్శిస్తారన్నారు. అదేవిధంగా ఈ వెబ్‌నార్ ద్వారా సెంటాక్, కళాశాలల శాఖాధిపతులతో ప్రత్యక్షంగా సంభాషించవచ్చన్నారు. ఆరోజు ఉదయం 10 గంటల నుంచి మధ్యాహ్నం 12 వరకు వెబ్‌నార్‌లో పాల్గొనడానికి ఆసక్తి ఉన్న విద్యార్థులు, తల్లిదండ్రులను ఆహ్వానిస్తున్నట్టు తెలిపారు. వెబ్‌నార్‌లో పాల్గొనడానికి లింకు.. మీట్.గూగుల్.కామ్./ఆర్ఇపి–ఎక్స్‌హెచ్ఐక్యూ–ఎస్‌కెఐ, అదేవిధంగా యూట్యూబ్.బిఇ/డబ్ల్యుపిఎక్స్‌జిఎస్5వైసిఐక్యూ లింక్‌లో లైవ్ ద్వారా పాల్గొనవచ్చన్నారు.

స్టాక్ పాయింట్‌ను తనిఖీ చేసిన డీవైఈవో


మండల స్టాక్ పాయింట్‌కు చేరుకున్న నోట్‌బుక్స్‌ను పరిశీలిస్తున్న డీవైఈవో నరసింహ ఫణి

రాయవరం: విద్యాకానుక–5లో భాగంగా వచ్చే విద్యా సంవత్సరంలో విద్యార్థులకు వివిధ రకాల వస్తువులను సరఫరా చేయనున్నారు. అందుకు రాయవరం శ్రీరామయ్య జెడ్పీ ఉన్నత పాఠశాలలో మండల స్టాక్ పాయింట్ ఏర్పాటు చేశారు. ఈ పాయింట్‌ను రామచంద్రపురం ఉప విద్యాశాఖాధికారి శ్రీపాద నరసింహ ఫణి శుక్రవారం తనిఖీ చేశారు. మండల విద్యాశాఖాధికారి–2తో కలిసి ఆయన ఈ స్టాక్ పాయింట్‌ను తనిఖీ చేసి, భద్రతా ఏర్పాట్లు పరిశీలించారు. మండల స్టాక్ పాయింట్‌కు ఇప్పటి వరకూ నోట్‌బుక్స్ మాత్రమే చేరుకున్నాయని ఎంఈవో–2 సూర్యనారాయణ డీవైఈవో ఫణి తెలిపారు. మండల స్టాక్ పాయింట్‌కు వచ్చే వస్తువులను పాఠశాలలకు సరఫరా చేసే లోపు నాణ్యత దెబ్బతినకుండా అవసరమైన చర్యలు తీసుకోవాల్సిందిగా సూచించారు. అనంతరం మండల స్టాక్ పాయింట్‌లో నిర్వహించాల్సిన రికార్డులను పరిశీలించారు. కార్యక్రమంలో పాఠశాల హెచ్ఎం వీఎస్ సునీత, ఎంఐఎస్ కో–ఆర్డినేటర్ ఎస్.రామారావు తదితరులు పాల్గొన్నారు.

కరాటేతో ప్రాణ రక్షణ


విద్యార్థులకు శిక్షణ ఇస్తున్న దుర్గారావు

- ఖడ్గ విన్యాసంలో రాణిస్తున్న దుర్గారావు, సురేష్
- విద్యార్థులకూ నేర్పుతున్న వైనం
- వేసవిలో ఉచిత శిక్షణా శిబిరం నిర్వహణ
- బ్లాక్ బెల్ట్ సాధించిన యువకులు

కపిలేశ్వరపురం: మారిన సామాజిక పరిస్థితుల నేపథ్యంలో నేర ఘటనలు పెరిగాయి. మనసులో కలిగిన ప్రతికూల భావనలను అతిగా ఊహించుకుని, ఎదుటి వారిపై అసహనం రూపంలోనో, ఆగ్రహం రూపంలోనో వ్యక్తం చేస్తున్నారు. తరచూ జరిగే ఇలాంటి ఘటనలు ఒక్కోసారి తీవ్ర రూపం దాల్చి ప్రాణాలమీదకు తెచ్చుకుంటున్నారు. మనుషుల మధ్య మంచి చెడులు ఎలా ఉన్నా ప్రాణాలను కాపాడుకోవాల్సిన అవసరం ఎంతైనా ఉంది. అందుకోసం కరాటే లాంటి ఆత్మ రక్షణ విద్యను అభ్యసించడం ప్రయోజనకరం. కరాటే విద్యను నేర్చుకుని మెరుగైన ఫలితాలను, గుర్తింపును సాధించిన వారిలో కపిలేశ్వరపురం మండలంలోని మత్సా దుర్గారావు, పితాని సురేష్ ఉన్నారు. ఇతరులకు ఉచితంగా నేర్పుతూ ముందుకు సాగుతున్నారు.

కరాటే జీవితం ప్రారంభమిలా..

వారిద్దరూ ఆలమూరు మండలం కలవచర్లలోని గోల్డెన్ డ్రాగన్ చైనీస్ కుంగ్ ఫూ మార్షల్ ఆర్ట్స్ శిక్షణా సంస్థ నిర్వాహకులు టి.అబ్బులు వద్ద కుంగ్ ఫూ, కరాటే క్రీడల్లో శిక్షణ పొందారు.

కరాటే కుంగ్ ఫూ లోని మూడు ప్రధాన విభాగాలైన కిక్స్ (కాళ్లతో తన్నుతూ పోరాడటం), కటాస్ (జంతువుల భంగిమలో పోరాడటం), వెపన్స్ (ఆయుధాలతో విన్యాసం)లలో వారు మంచి ప్రావీణ్యం సాధించారు. నేడు వారిద్దరూ విడివిడిగా వివిధ వేదికల ద్వారా అనేక మందికి శిక్షణ ఇస్తూ చురకత్తి లాంటి క్రీడాకారులను తయారు చేస్తున్నారు.

దుమ్ము రేపుతున్న దుర్గారావు



అంగరకు చెందిన మత్సా దుర్గారావు చిన్నప్పుడు తాను చూసిన సినిమాలో హీరో చేసిన కరాటే విన్యాసాలకు ఆకర్షితుడయ్యాడు. ఎప్పటికైనా కరాటే మాస్టర్ కావాలనుకున్న దుర్గారావు నిత్య సాధనతో అనేక పోటీల్లో ప్రతిభ కనబరిచాడు. ప్రస్తుత వేసవిలో అంగర జెడ్పీ ఉన్నత పాఠశాలలో విద్యార్థులకు ఉచిత ఆత్మ రక్షణ తరగతులను బోధిస్తున్నాడు. కలవచర్లలో తన గురువు అబ్బులు వద్ద సాధన చేసి 2018లో బ్లాక్ బెల్ట్ సాధించాడు. 2023 అక్టోబర్‌లో విశాఖలో తైక్వాండో ఫెడరేషన్ ఆధ్వర్యంలో రాష్ట్ర స్థాయి అండర్ 14 విభాగం పోటీల్లో అంగరకు చెందిన ముగ్గురు విద్యార్థులు ద్వితీయ స్థానంలో నిలిచారు. 2019 మార్చిలో హైదరాబాద్‌లో రాష్ట్ర స్థాయి తైక్వాండో పోటీల్లో రెండో స్థానాన్ని, 2016 మేలో తాళ్లరేవులో డిఫెన్స్ ఈగల్ ఇన్‌స్టిట్యూట్ వారి రాష్ట్ర స్థాయి టోర్నమెంట్‌లో ప్రథమ స్థానాన్ని, 2017లో ద్వారపూడిలో లయన్స్ కుంగ్ ఫూ మార్షల్ ఆర్ట్స్ వారి రాష్ట్ర స్థాయి పోటీల్లో ద్వితీయ స్థానాన్ని, 2019లో విజయవాడలో నిన్సికన్ థాయ్ చీ కుంగ్ ఫూ అకాడమీ రాష్ట్ర స్థాయి పోటీల్లో ప్రథమ స్థానాన్ని సాధించాడు.

చురకత్తి సురేష్


కత్తి విన్యాసం చేస్తున్న పితాని సురేష్

కపిలేశ్వరపురానికి చెందిన పితాని సురేష్ ప్రస్తుతం హైదరాబాద్‌లోని మియాపూర్ హెచ్ఎంటీ కాలనీలో ఎస్‌కే మార్షల్ ఆర్ట్స్ అకాడమీలో కోచ్‌గా పనిచేస్తున్నారు. ఆరు నెలల క్రితం వరకూ సురేష్ మండపేట, రామచంద్రపురం నియోజకవర్గ పరిధిలోని పలు వేదికలపై ప్రతిభ కనబరిచాడు. 8వ తరగతి చదువుతుండగా 2007లో చేరాడు. తెల్లవారుజామున 4 గంటలకు నిద్ర లేచి గోదావరి గట్టు మీదుగా సైకిల్‌పై 12 కిలోమీటర్లు ప్రయాణం చేసి, తర్ఫీదు పొంది పాఠశాల తెరిచే సమయానికి కపిలేశ్వరపురం వచ్చేసేవాడు. 2008లో బ్లాక్ బెల్ట్ సాధించిన సురేష్ 2009 జూలైలో విజయనగరంలో కుంగ్ ఫూ కరాటే జాతీయ స్థాయి చాంపియన్‌షిప్ పోటీల్లో గోల్డ్ మెడల్ సాధించాడు. 2012 విజయవాడలో రాష్ట్ర స్థాయి పోటీల్లో ద్వితీయ స్థానంలో నిలిచి రజత పతకాన్ని, 2013లో కోనసీమలోని పేరూరులో రాష్ట్ర స్థాయి పోటీల్లో రెండో స్థానంలో నిలిచారు. 2014 నుంచి ఇనిస్టిట్యూట్ స్థాపించి శిష్యులను రాష్ట్ర స్థాయి పోటీలకు తర్ఫీదు ఇస్తూ విజయాలను సాధించారు.

గుట్టుచప్పుడు కాకుండా ఇసుక తరలింపు

రాజోలు: జగనన్న కాలనీలలో నిర్మాణాల కోసం రాజోలు తహసీల్దారు కార్యాలయ ఆవరణలో స్టాక్ పాయింట్‌లోని ఇసుకను శుక్రవారం రాత్రి గుర్తు తెలియని వ్యక్తులు గుట్టుచప్పుడు కాకుండా తరలించుకుపోతున్నారు. స్టాక్ పాయింట్‌లోని ఇసుకను గృహ నిర్మాణ లబ్ధిదారులకు మాత్రమే కూపన్లు ఇచ్చి గృహనిర్మాణ శాఖ అధికారులు పంపిణీ చేస్తారు. గత కొంతకాలంగా స్టాక్ పాయింట్‌లోని ఇసుకను కొందరు ప్రైవేటు వ్యక్తులు దర్జాగా జేసీబీని ఉపయోగించి ట్రాక్టర్లల్లో లోడ్ చేసి, ఇసుకను తరలించుకుపోతున్నారు. స్టాక్ పాయింట్‌లోని ఇసుక సగం మేర ఖాళీ అయిపోయిందని స్థానికులు ఆరోపిస్తున్నారు. ఎన్నికలను పురస్కరించుకుని, ఎన్నికల కోడ్ నేపథ్యంలో లబ్ధిదారులకు ఎలాంటి ఇసుక టోకెన్లు ఇవ్వలేదని గృహనిర్మాణ శాఖ అధికారులు తెలిపారు. గతంలో రెండు, మూడు పర్యాయాలు ఇసుక తరలించుకుపోయినట్టు తమకు ఫిర్యాదులు వచ్చాయని, అయితే ఇసుక తరలింపుపై నిఘా ఉంచామన్నారు. ఇసుక తరలించుకు పోతున్న ట్రాక్టర్లపై పోలీసులకు ఫిర్యాదు చేశామని హౌసింగ్ ఏఈ సత్యనారాయణ తెలిపారు.

క్యాన్సర్ బాధిత చిన్నారికి సాయం

రావులపాలెం: బ్లడ్ క్యాన్సర్‌తో బాధపడుతున్న పదేళ్ల బాలిక వైద్యానికి స్థానిక కాశీ అన్నపూర్ణాదేవి సేవా సంస్థ సభ్యులు శుక్రవారం రూ.17 వేల నగదును ఆర్థిక సాయంగా అందజేశారు. బిక్కవోలు మండలం బిక్కవోలు గ్రామానికి చెందిన ఏళ్ళ మేఘనశ్రీ వయస్సు పదేళ్లు. బ్లడ్ క్యాన్సర్‌తో బాధపడుతోంది. చెన్నై ఆస్పత్రిలో 10 నెలలు ఉండి వైద్యం పొందాలని డాక్టర్లు సూచించారు. ఇందుకు రూ.10 లక్షల వరకు ఖర్చు అవుతుందన్నారు. మేఘనశ్రీ తండ్రి అనపర్తిలో ఒక కాలేజ్‌లో ఆఫీస్ బాయ్‌గా పని చేస్తున్నారు. వైద్యం చేయించే స్తోమత లేదు. దీంతో సంస్థ సభ్యులు ఈ సాయం అందజేశారు.